మామిడిపండుకు ఈగ ముప్పు

- వర్షాలతో పొంచి ఉన్న ప్రమాదం
- మామిడి రైతులకు అధికారుల హెచ్చరిక
- జాగ్రత్తలు పాటించాలని సూచన

పిఠాపురం: మేడిపండు చూడు మేలిమై ఉండు.. పొట్ట విప్పి చూడు పురుగులుండు.. అన్నారు మహా కవి వేమన. ఇప్పుడు మామిడి పండు చూడు మేలిమై ఉండు పొట్ట విప్పిచూడు పురుగులుండు అంటున్నారు అధికారులు. ఎండాకాలం ఎప్పుడు వస్తుందా, ఎప్పుడెప్పుడు మధురఫలాలు మామిడి పండ్ల రుచి ఆస్వాదిద్దామా అని పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఎదురు చూస్తారు. రకం ఏదైనా మామిడి రుచి ప్రత్యేకమైనదే. అటువంటి మామిడి కాయలకు వర్షాలు పడుతున్న వేళ పండు ఈగ రూపంలో పెద్ద కష్టం రానున్నట్టు అధికారులు చెబుతున్నారు. కాయ చూడడానికి పైకి బాగానే కనిపిస్తుంది. తీరా మాగ వేసి పండిస్తే కుళ్లు కనిపిస్తుంది. దాని లోపల చూస్తే బియ్యపు గింజ పరిమాణంలో తెల్లటి పురుగులు కనిపిస్తుంటాయి.

వ్యాప్తి చెందితే అపార నష్టం

ఒకప్పుడు కాపు దశలో వర్షాలు పడ్డ సందర్భాల్లోనే ఇవి కనిపించేవి. కాని గత కొన్నేళ్లుగా పండు ఈగ నష్టం రివాజుగా మారింది. అన్ని ప్రాంతాల్లోనూ వర్షాలు పడుతుండడంతో ప్రస్తుతం మామిడిపై పండుఈగ దాడి పెరిగే అవకాశాలు ఉన్నట్లు ఉద్యానశాఖ అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. ఇది వ్యాపిస్తే నష్టం అపారంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు గతంలో కరోనా నేపథ్యంలో సరైన మార్కెట్ లేక చాలా మంది రైతులు మామిడిని తోటల్లో ఎక్కువగా వదిలేశారు. దీంతో పండుఈగ తన సంతతిని పెంచుకుని తోటల్లో మాటు వేసి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పండుఈగ సోకితే మామిడి నాణ్యత పూర్తిగా దెబ్బతిని రాబడి పడిపోయి రైతు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం మామిడి సీజన్ కావడంతో మే, జూన్ నెలల్లో ఎక్కువగా సోకి మామిడి రైతులకు అపార నష్టం కలిగించే అవకాశం ఉంది. దీంతో రైతులు అప్రమత్తగా ఉండాలని ఉద్యాన శాఖాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ అమ్మకాలు ఉన్నందున నాణ్యత దెబ్బతినకుండా ఉండాలంటే పండుఈగ పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.




మామిడి తోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారి. (అంతర చిత్రం) పండుఈగ సోకి పురుగులు పట్టిన మామిడి కాయ

రాలిన పండ్లతోనే..

మామిడి తోటల్లో పండ్లు నేల మీద పడిపోయినప్పుడు వాటిని అలా వదిలేస్తారో అక్కడ పండుఈగ విస్తృతంగా వ్యాప్తి చెందుతుంది. అలా నేల మీద వదిలేసిన పండ్లను పండుఈగలు తమ సంతతిని వృద్ధి చేసుకోడానికి వేదికగా వాడుకుంటాయి. తద్వారా విపరీతంగా పండు ఈగలు పెరిగి చెట్లకు ఉన్న కాయలపైనా గుడ్లు పొదుగుతాయి. దీంతో కాయ బయటకు బాగా కనిపించినా లోపల పండు తయారయ్యాక పురుగులు కనిపిస్తుంటాయి. పండు ఈగ జామ తోటల్లో ఎక్కువగా ఉంటుంది. అందుకని పక్కన జామ తోటలు ఉన్న ప్రాంతాల్లో మామిడి తోటలు ఉన్న రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. జామ తోటల సీజన్ ముగియగానే ఆ ఈగలు మామిడి తోటలపై దాడి చేస్తుంటాయి.



మామిడి తోటలో పండు ఈగ నివారణకు ఏర్పాటు చేసే లింగాకర్షక బుట్టలు

పండు ఈగ కనిపిస్తే ఇలా చేయండి

ఎప్పటికప్పుడు మామిడి తోటల్లో రాలిన కాయలు, పండ్లను వెంటనే తీసి వాటిని దూరంగా ఒక గొయ్యి తీసి పాతి పెట్టుకోవాలి. లింగాకర్షక బుట్టలు (మిథైల్ యూజినల్ ట్రాప్స్) తోటల్లో ఏర్పాటు చేసుకోవాలి. సుమారుగా ఒక ఎకరానికి 4 నుంచి 6 బుట్టలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పండుఈగ ఉధృతిని తగ్గించవచ్చు. లింగాకర్ష బుట్టల్లో నాలుగు ఈగలు పడితే కచ్చితంగా ఈగ ఉధృతి ఉన్నట్లు గుర్తించాలి. దీని నివారణకు పులిసిన కల్లు, మలాతియాన్ గాని రెండు మిల్లీ లీటర్లు కలిపి కొద్దిగా బెల్లం వేసి ఉంచాలి. అది పులిసి ఒక రకమైన వాసన వస్తుంది. దానిలో ఏదైనా పండ్ల రసం కలిపి ఆమిశ్రమాన్ని మట్టి పాత్రల్లో తోటల్లో అక్కడక్కడా పెట్టాలి. దానికి పండుఈగ అధికంగా ఆకర్షితమై వచ్చి ఆ రసం పీల్చగానే ఈగ చనిపోతుంది. తద్వారా ఈగ నివారణ సాధ్యమవుతుంది. ఈ విధానం వల్ల రసాయనాలు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతిలో ఈగను నివారించుకోవచ్చు. ఇంకా ఈగ ఉధృతి ఎక్కువగా ఉంటే ఒక లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్లు మలాతియాన్ కలిపి తోటల్లో పిచికారీ చేసుకోవాలి. కాయలకు కవర్లు ఏర్పాటు చేయడం ద్వారాను ఈగ ఉధృతిని తగ్గించుకోవచ్చు. కాయలకు ఏర్పాటు చేసిన కవర్లు కొన్ని రోజులు ఉంచి తీసేయకూడదు. అలా తీయడం వల్ల ఈగ దాడి చేసే అవకాశం ఉంది. కాయను పూర్తిగా కోయవలసి వచ్చినప్పుడు మాత్రమే కవర్లు తీయాలి. కవరు తీసిన కాయలను చెట్టుకు ఉంచకూడదు.



- కేఎస్ శైలజ,
ఉద్యానశాఖాధికారి, పిఠాపురం

క్లుప్తంగా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



కొమరగిరిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ రాజబాబు

కొత్తపల్లి: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రాజబాబు సూచించారు. మండలంలోని కొమరగిరిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు 4800 మంది కూలీలకు పని కల్పిస్తున్నట్టు చెప్పారు. వేసవి నేపథ్యంలో కూలీలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ పని చేస్తున్నారన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 4.05 లక్షల పని దినాలే లక్ష్యమన్నారు. ఇప్పటికే సుమారు 1.38 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. గ్రామాల్లో పని కావాలన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నట్టు తెలిపారు. పని జరిగే చోట తాగునీరు, తగిన భద్రత చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

ఇంద్రజాలంపై అవగాహన



విద్యార్థులకు ఇంద్రజాలాన్ని నేర్పుతున్న శ్రీనివాస్

పెద్దాపురం: స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో శనివారం ప్రముఖ ఇంద్రజాల ప్రదర్శకుడు బుద్ధా శ్రీనివాస్ విద్యార్థులకు ఇంద్రజాలంలో చిట్కాలపై అవగాహన కల్పించారు. శిబిరం సమన్వయకర్త కూనిరెడ్డి అరుణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో జేవీవీ నాయకులు, ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు సుమారు 130 మంది విద్యార్థులు మ్యాజిక్ క్లాస్‌లో పలు అంశాలను తెలిపేలా చిల్డ్రన్ క్లబ్ ఏర్పాటుచేసింది. చేతులపై మంటలు రావడం, అగ్గితో కాల్చుకోవడం, పేపర్ కటింగ్, తాడు పేనడం వంటి పలు అంశాలను విద్యార్థులకు నేర్పించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బుద్ధ శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అరుణ్‌కుమార్, అమృత, నమ్రత, దుంగల శ్యాంకుమార్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి



కోనపాపపేటలో క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: గ్రామస్థాయి నుంచే యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉమ్మిడి చిన్న సూచించారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో శనివారం క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడాకారులకు సుమారు రూ.35 వేల విలువ చేసే క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన పలువురు క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో బోణం రాముడు, ఉమ్మిడి గోవింద్, మైలపల్లి దాసు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మరకత మణికంఠ

బోట్‌క్లబ్: అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తర నక్షత్రం సందర్భంగా శనివారం స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక పెద్దమార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి వారికి ఉత్తరా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్థానిక రామారావుపేటలోని మరకత మణికంఠకు ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పాలు, పంచదార, విభూది, గంధం, కొబ్బరినీళ్లు, తేనె వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. పీఠం వ్యవస్థాపకులు నందమూరి వినోద్ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. పీఠం కార్యవర్గ సభ్యులు పుప్పాల ఉదయభాస్కర్, పబ్బినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయసాయం

కాకినాడ బార్ ఉపాధ్యక్షుడు కొర్లమండ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసిసోయేషన్ ఉపాధ్యక్షుడు వీరభద్రరావు

సామర్లకోట: పేదలకు ఉచిత న్యాయ సాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానని కొర్లమండ వీరభద్రరావు అన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా మూడో పర్యాయం ఎన్నికైన వీరభద్రరావును స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో పలువురు అభినందించారు. మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గిడుతూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక జర్నలిస్టుగా, న్యాయవాదిగా పేదలకు వీరభద్రరావు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. వీరభద్రరావు మాట్లాడుతూ తన భార్య శ్రీవాణి కూడా న్యాయవాదిగా తనకు తోడుగా ఉండటంతో తాను అనేక విజయాలను సాధించగలిగానని తెలిపారు. వీరభద్రరావు దంపతులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు చిత్తులూరి వీర్రాజు, అమలకంటి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

వైజాగ్ వారియర్స్ క్రికెట్‌కు 'కోట' క్రీడాకారుడు



పి.గంగాధర్

సామర్లకోట: వైజాగ్ వారియర్స్ క్రికెట్ జట్టుకు సామర్లకోట వీర్రాఘవపురానికి చెందిన పి.గంగాధర్ ఎంపికైనట్టు జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు జె. శివకుమార్, కార్యదర్శి పి.సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లల్లో భాగంగా ఈ ఎంపిక జరిగిందని వారు శనివారం రాత్రి స్థానిక విలేకర్లకు తెలిపారు. గంగాధర్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లా క్రికెట్ చాంపియన్ డి.శ్రీనివాసరావు అభినందించారు.

అత్యంత భద్రంగా ఈవీఎంలు

- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత
- ఈఆర్వో జేఎస్ రామారావు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగింపు నేపథ్యంలో కాకినాడ జేఎన్‌టీయూ కళాశాలలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద భారీ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. నిత్యం ఉదయం, సాయంత్రం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లపై పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కూడా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. నియోజకర్గ పరిధిలో 2,15,095 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 13వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో 201 పోలింగ్ కేంద్రాల్లో 1,76,993 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం స్వీప్ లక్ష్యంతో 82.29 శాతానికి చేరిందన్నారు. వచ్చే నెల నాలుగో తేదీన కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద షిఫ్టుల వారీగా సిబ్బంది విధులు నిర్వర్తించేలా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. పోలీసు బలగాలతో పాటు ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వర్తిస్తారన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు సహకరించాలని ఆర్‌ఓ జేఎస్ రామారావు కోరారు.



కాకినాడలో స్ట్రాంగ్ రూముల వద్ద పర్యవేక్షిస్తున్న ఆర్‌ఓ సీతారామారావు

వానలతో ప్రజలకు ఊరట

సామర్లకోట: కొంతకాలంగా ఎండలతో హడలిపోతున్న ప్రజలు తరుచూ వానలు పడుతూ వాతావరణం చల్లబడి ఊరట చెందుతున్నారు. వేసవి కాలంలో మే నెల ఎండలకు బయటకు రాలేని పరిస్థితి ఉంటుందని అందరూ భావించారు. మే 13 వరకు ఎండలు మండి పోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. బంగాళాఖాతంలో అల్పపీడనంతో మూడు రోజులుగా వాతావరణం చల్లబడింది. శనివారం ఉదయం నుంచి మేఘాలు అలముకుని వాతావరణంలో మార్పు వచ్చి తరుచూ వాన కురుస్తుండడంతో వేడి తగ్గి ప్రజలు ఊరట చెందుతున్నారు. నైరుతి రుతుపవనాలు ఆదివారం అండమాన్ నికోబార్ దీవుల్ని చేరుకుంటాయని వాతావరణ శాఖ తెలియజేయడంతో రైతులు ఆనంద పడుతున్నారు. రోహిణి ముందుగా నైరుతి రుతుపవనాలు వస్తే వేసవి కాలానికి వీడ్కోలు చెప్పవచ్చని ప్రజలు భావిస్తున్నారు. రుతు పవనాలు రాక పోతే ఈ చినుకులకు రోహిణిలో వృద్ధులు, చిన్న పిల్లలు అల్లాడిపోవలసి వస్తుందని హడలిపోతున్నారు. జనం రుతుపవనాల కోసం ఎదురు చూస్తున్నారు.



సామర్లకోటలో కురిసిన వాన

సీసీ కెమెరాల కంట్రోల్ రూము ఏర్పాటు

- జేసీ రామ్‌సుందర్‌రెడ్డి



జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలను పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాల కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమును ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని సురక్షితంగా భద్రపరచినట్టు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా స్ట్రాంగ్ రూము వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేశామని జేసీ రామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు స్ట్రాంగ్ రూము భద్రతను పరిశీలించేందుకు వీలుగా జేఎన్టీయూలోని క్యాంటీన్ పైన సీసీ టీవీ కెమెరాల వ్యూను చూసేందుకు స్క్రీన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఏజెంట్లు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని జేసీ రామ్ సుందర్‌రెడ్డి తెలిపారు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు



పిఠాపురం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

- ఐదోసారి బార్ అధ్యక్షుడిగా రాజారావు

పిఠాపురం: పిఠాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం ప్రశాంతంలో జరిగాయి. సీనియర్ న్యాయవాది మేరుగు రాజారావు ఐదోసారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా కేఎస్ఆర్ భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, లేడీ రిప్రజెంటేటివ్ పోస్టులకు ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా ఎస్ఎం ఆలీ, కార్యదర్శిగా కొంజెర్ల అప్పారావు, కోశాధికారిగా గౌతు రాజా, లేడి రిప్రజెంటేటివ్‌గా ఎం.సత్యవతి ఎన్నికయ్యారు. స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా ఎంవీవీ సత్యనారాయణ మరో ఐదుగురు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది పడాల రవి తెలిపారు. ఐదోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన మేరుగు రాజారావును పలువురు న్యాయవాదులు అభినందించారు.

నేడు భావనారాయణుని కల్యాణం

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో కొలువైన రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండుగగా జరగనుంది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం అనంతరం రాత్రి 9 గంటలకు కల్యాణం ప్రారంభమవుతుందని ఆలయ ఈఓ భీమేశ్వరరావు తెలిపారు. కల్యాణోత్సవాలలో భాగంగా భావనారాయణ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు పంచామృత అభిషేకం అనంతరం వధూవరులుగా చేశారు. శనివారం స్వామి వారిని పెద్ద శేష వాహనంపై ఊరేగించి గ్రామోత్సవం చేశారు. భావనారాయణ స్వామి కల్యాణోత్సవంలో పాల్గొని కనులారా వీక్షించాలని ఈఓ కోరారు.



వధూవరులుగా ఉత్సవ మూర్తులు భావనారాయణ స్వామి, రాజ్యలక్ష్మి, అమ్మవారు

వైభవంగా శ్రీవారి పల్లకీ సేవ



ఎస్.అన్నవరంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు



తంటికొండలో పందిరి రాట వేస్తున్న ఈఓ వెంకటలక్ష్మీకుమార్, అర్చకులు



చిల్లంగి వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవంలో మహిళల కోలాట ప్రదర్శన

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి,అమ్మవార్ల పల్లకీసేవ శనివారం వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యపూజలు, కైంకర్యాలు నిర్వహించిన అర్చకులు సూర్యప్రభ వాహనంపై స్వామివారి ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ నిర్వహించారు. శ్రీవారికి సహస్ర దీపాలంకార సేవ, భక్తుల స్వహస్తాలతో హారతి సమర్పణ, శేష వాహన సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు స్వామివారి కల్యాణం

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు శ్రీకృష్ణ,గోపికా పూజ, సాయంత్రం ఆరు గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి ఏడు గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ ఆధ్వర్యంలో పండితులు ఉదయం నుంచి స్వామి, అమ్మవార్ల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కూతురుగా చేసి పందిరి రాట వేశారు. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఏడు గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్టు ఈఓ తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కిర్లంపూడి: చిల్లంగిలో ఏలేరు నది ఒడ్డున వేంచేసిన వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. అనంతరం మహిళల కోలాట ప్రదర్శన నడుమ స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

21న రామరాజు కీర్తనల గానం

బోట్‌క్లబ్: ప్రముఖ సంగీత విద్వాంసుడు, వాగ్గేయకారుడు కొచ్చర్లకోట రామరాజు జయంతి సందర్భంగా ఈనెల 21న కాకినాడ సూర్యకళామందిరంలో రామరాజు కీర్తనల గానం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు కొచ్చర్లకోట రామరాజు చారిటబుల్ ట్రస్టు న్యూఢిల్లీ ప్రతినిధి కొచ్చర్లకోట ప్రభాకర సుందరరావు, సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి శనివారం సూర్యకళామందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సుందరరావు మాట్లాడుతూ రామరాజు రచించిన శ్రీకృష్ణ కర్ణామృతం, శ్రీరామ కర్ణామృతం వంటి కీర్తనలు నేటి తరానికి తెలియజేసే ఉద్దేశంతో పెద్దాడ సూర్యకుమారి తదితర కళాకారులు గీతాలను సీడీ రూపంలో తయారు చేయించినట్టు తెలిపారు. ఈ సీడీ ఆవిష్కరణను ఈనెల 21న సాయంత్రం సూర్యకళామందిరంలో నిర్వహిస్తున్నామన్నారు. సీడీని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆవిష్కరిస్తారన్నారు. ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ కార్య కారిణి సభ్యులు, ఇండియా ఫౌండేషన్ ప్రెసిడెంట్ వారణాసి రాం మాధవ్ పాల్గొంటారన్నారు. అనంతరం పెద్దాడ సూర్యకుమారి, శిష్యులచే కీర్తనల గానం జరుగుతుందన్నారు.

దేదీప్యమానం



సర్క్యులర్ మండపానికి విద్యుత్ సొగసులు



వనదుర్గ ఆలయానికి విద్యుత్ అలంకరణ

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల సందర్భంగా రత్నగిరిపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. కొండ దిగువన టోల్‌గేట్ వద్ద గల మహావైకుంఠ నారాయణ ద్వారం, ఘాట్ రోడ్లు, స్వామివారి ఆలయం, ఆలయ ప్రాంగణం, సత్రాలు, ఇతర భవనాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం సందర్భంగా ఆదివారం కల్యాణ వేదిక, ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు విద్యుత్ శాఖ డీఈ వి.సత్యనారాయణ తెలిపారు.



అలరిస్తున్న శివపార్వతుల విద్యుత్ కటౌట్